"రేపటితో కార్తీకమాసం అయిపోతుంది. ఇవాళ పంచె కట్టుకుని పుత్తరీయంతో వస్తే శివుడికి నీ చేతులతో అభిషేకం చేసుకోవచ్చు."

"రాను." స్థిరంగా చెప్పాడా భక్తుడు.

"అదేం? నీకు శివుడంటే భక్తి లేదా?" ప్రశ్నించాడు పూజారి.

"ఉంది. కాని రాను."

"దేనికి రావు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు పూజారి మళ్ళీ.

"ఎందుకంటే నిన్న రాత్రి శివుణ్ణి గుడికి వచ్చే భక్తుల దుస్తుల విషయంలో మీరు చెప్పిన నియమాల గురించి అడిగాను. తను ఎన్నడూ అలాంటి నియమాలని విధించలేదని, అసలు తను ఎన్నడూ మీ గుళ్ళోకే అడుగు పెట్టలేదనీ స్వయంగా ఆ పరమశివుడే చెప్పాడు."

ఆ సమాధానంతో పూజారి మొహం మాడిపోయింది.

## 40. దేవుని రాక

ప్రతీ శనివారం భాగ్యవతి తన యిష్టదైవమైన శ్రీనివాసుడికి నిత్యపూజ చేస్తుంది. గత ఏడేళ్ళుగా ఆమె ఆ నియమాన్ని పాటిస్తూ వస్తోంది.

ఆ శనివారం కూడా భాగ్యవతి శ్రీనివాసుడికి నైవేద్యం సమర్పించింది. ఇంతలో బెల్ మోగితే వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పోస్ట్‌మేన్. అతనిచ్చిన కార్డు అందుకుని అందులో రాసి వున్నది చదివింది. ముత్యాల్లాంటి అక్షరాలతో వున్న ఆ కార్డులో యిలా రాసి వుంది.

డియర్ భాగ్యవతి,

ఈ శనివారం నేను మీ కాలనీకి వస్తున్నాను. మీ యింటికి భోజనానికే సుమా! అన్నీ సిద్ధంచేసి వుంచు.

నీ,

శ్రీనివాసుడు.

ఆమెకి చెప్పలేని ఆనందం కలిగింది. ఆ రోజే శనివారం! 'స్వామి ఎప్పుడైనా రావచ్చు.' అనుకుంది. శ్రీనివాసుడికి బాగా యిష్టమైన లడ్డూలు, చక్కెరపొంగలి చేయడానికి కావల్సిన సరుకులు యింట్లో సిద్ధంగా లేవు.

బయట వర్షం పడుతూండటంతో రెయిన్ కోట్ తొడుక్కుని పచారీ దుకాణానికి బయలుదేరింది. అవి కొనుక్కుని తిరిగి వస్తూంటే, ఓ యింటి అరుగు మీద నిస్సహాయంగా కూర్చుని వున్న బిచ్చగాళ్ళిద్దరు ఆమె కంట పడ్డారు. తైల సంస్కారంలేని దుబ్బు తలలు, మాసిన దుస్తులు...

ఆమె వెంకటేశ్వరస్వామి నిజంగా వస్తే ఎలా రిసీవ్ చేసుకోవాలో ఆలోచిస్తూ, ఏం మాట్లాడాలా అనే వూహల్లో తేలిపోతూ నడుస్తూంటే ఓ బిచ్చగత్తె భాగ్యవతిని చూసి అడిగింది.

"అమ్మా. రెండు రోజుల నించి అన్నం లేదు. కాస్తంత ఏదైనా యిస్తే వండుకుంటాను."

ఆమెవంక చిరాగ్గా చూస్తూ చెప్పింది భాగ్యవతి.

"నా దగ్గరేం లేవు."

ఆ బిచ్చగాళ్ళిద్దరూ వెళ్తూన్న భాగ్యవతి వంక నిస్సహాయంగా చూసారు. పదడుగులు వేసాక ఆమె మనసులోని దయ ఆమెని ఆపింది.

'పాపం. రెండురోజులనించి భోజనం లేదంటోంది. ఎవరికయినా ఆకలి చెడ్డ బాధేగా?' అనిపించింది.

తను కొన్న సరుకుని ఆమె వాళ్ళకిచ్చింది. వెనక్కి తిరిగి దుకాణానికి వెళ్ళి మళ్ళీ షాపింగ్ చేసింది. వర్షం ఎక్కువ అవడంతో హడావిడిగా యింటికి వెళ్తూ ఆమె దారిలో ఆ బిచ్చగత్తెని చూసి, వర్షానికి పొయ్యి రాజేసుకోలేకపోతున్న ఆమెకి తన పాత రెయిన్ కోట్‌ని పొయ్యికి అడ్డు పెట్టుకోడానికి యిచ్చింది.

ఇంటికి వచ్చి స్టవ్ వెలిగించింది. చక్కెర పొంగలి, లడ్డూలు చేసి స్వామి కోసం ఎదురు చూడసాగింది. సాయంత్రం అయింది. రాత్రయినా

ఆయన రాలేదు. తన యిష్ట దైవం తన యింటికి వస్తానని రానందుకు ఆమెకి ఎంతో దుఃఖం వచ్చింది.

మర్నాడు మళ్ళీ భాగ్యవతి పూజ అయ్యాక డోర్ బెల్ మోగింది. పోస్టమేన్ ఆమెకి ఇంకో కార్డు యిచ్చాడు. క్రితం రోజు చేతిరాతే కనబడటంతో ఆత్రంగా దాన్ని చదివింది ఆమె. అందులో ఇలా వుంది.

డియర్ భాగ్యవతి,

నిన్న నాకు చక్కటి భోజనం పెట్టి నా కడుపు నింపావు. పైగా నా భార్యకి కోటు కూడా యిచ్చావు. థ్యాంక్స్.

నీ,

శ్రీనివాసుడు.

## 41. నాస్తికులు

నాస్తికులైన ఓ జంట దండలు మార్చుకుని పెళ్ళి చేసుకున్నారు. కొన్నాళ్ళకి వాళ్ళకో పాప పుట్టింది. నాస్తికులు కాబట్టి దైవ సంబంధమైన పేరు పెట్టడం యిష్టం లేక 'ఓల్గా' అనే పేరు పెట్టారు. వాళ్ళు తమ కూతురికి దేవుడి గురించి తెలీకుండా పెంచసాగారు. వాళ్ళయింట్లో దేవుడి పటం లేదు. పూజ అసలు లేనే లేదు. దాంతో ఓల్గాకి దేవుడి ఉనికి గురించి తెలీదు. క్రమంగా ఓల్గాకి అయిదేళ్ళు వచ్చాయి.

ఓరోజు ఓల్గా తల్లితండ్రులు తమ బిడ్డతో ఆటోలో వెళ్తూంటే ఏక్సిడెంటయి ఆటో తలకిందులైంది. భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఓల్గాకేం కాలేదు. తల్లితండ్రులిద్దరూ మరణించడంతో ఆలనా పాలనా చూడటానికి ఎవరూ లేని ఓల్గా అనాథయింది. దిక్కులేని ఆ పాపని ఓ పెద్దమనిషి తన యింటికి తెచ్చుకుని పెంచుకోదలచుకున్నాడు. అందుకు కోర్టు నించి అనుమతిని పొందాక ఆ పాపని తనింటికి తీసుకెళ్ళాడు.